అకుంఠిత దీక్షతో..



2



2

కరెంట్ షాక్‌తో హార్వెస్టర్ దగ్ధం

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

## కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మహిళలకు ప్రాధాన్యత

**అక్షరటుడే, కామారెడ్డి:** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మహిళలకు ప్రాధాన్యతనిస్తున్నామని.. అందుకే ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తున్నామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తెలిపారు. కామారెడ్డి పట్టణంలోని తన నివాసం వద్ద మంగళవారం మహిళలకు చీరలను అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. ప్రతి కుటుంబానికి అండగా నిలబడి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చడం తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, ఆర్డీవో గిరి, మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, తహశీల్దార్ హిమబిందు, డీసీసీ మాజీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు సందీప్, పట్టణ మాజీ అధ్యక్షుడు పండ్ల రాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



## కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో



**అక్షరటుడే, గాంధారి:** మండల కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాలను ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంటా వేసే సమయంలో ధాన్యం 40 కిలోల 800 గ్రాములకు సరిగ్గా తూకం వేయాలని ఆదేశించారు. అంతేగాని తరుగు పేరిట అదనంగా తూకం వేస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అతి త్వరలోనే జొన్న, మొక్కజొన్న కేంద్రాలను ప్రారంభించేందుకు ప్రభుత్వం యోచిస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రేణుక చావన్‌తో పాటు, మార్క్‌ఫెడ్ డీఎంలు తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్‌ఎస్‌కు కౌన్సిలర్ రాజీనామా.. కాంగ్రెస్‌లో చేరిక

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మున్సిపల్ 11వ వార్డు (లింగారెడ్డిపేట్) బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్ రామగాళ్ల లక్ష్మి శివానంద్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. అనంతరం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 11వ వార్డులో ఎలాంటి అభివృద్ధి జరగలేదని లక్ష్మి శివానంద్ ఈ సందర్భంగా తెలిపారు. అయితే ఎమ్మెల్యే మదన్ మోహన్ నాయకత్వంలో గత రెండేళ్లలో గణనీయమైన అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని పేర్కొన్నారు. శ్మశానవాటికకు బోరు వేయడం, సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేయడం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, విద్యుత్ సమస్యలను పరిష్కరించడం, హరిజనవాడలో కొత్త స్ట్రీట్ లైట్ల ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు చేపట్టారని వివరించారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రభావితమై కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, డీసీసీ వైస్ ప్రెసిడెంట్, కాంగ్రెస్ ఎల్లారెడ్డి మండలాధ్యక్షుడు కుర్మ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.




# రైతులపై ఎరువుల భారం

■ భారీగా పెరిగిన ధరలు ■ పెరగనున్న పెట్టుబడి ■ ఆందోళన చెందుతున్న రైతులు

**ఎరువుల ధరలు భారీగా పెరిగాయి. ఒక్కో బస్తాపై రూ.75 నుంచి రూ.350 వరకు రేట్లు పెరగడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ధరలు పెంచినట్లు ఆయా కంపెనీలు ఇప్పటికే డీలర్లకు సమాచారం ఇచ్చాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో రసాయన ఎరువుల తయారీకి వినియోగించే ముడిసరుకుల ధరలు, సుంకాలు విపరీతంగా పెరగడం, దిగుమతులు తగ్గడం, నౌకల ద్వారా రవాణా వ్యయం భారంగా మారడంతో ఎరువుల తయారీ కంపెనీలు ధరల పెంపునకు సిద్ధమయ్యాయి.**

**- భీమ్‌గల్, అక్షరటుడే**

నిజామాబాద్ జిల్లాలో వానాకాలం, యాసంగి సీజన్లలో సాగు విస్తీర్ణం భారీగా ఉంటోంది. జిల్లాలో జలవనరులు పుష్కలంగా ఉండటం వల్ల రైతులు పెద్ద ఎత్తున సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. సాధారణంగా వానాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 5.52 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయి. ఇందులో అత్యధికంగా వరి ఒక్కటే 4.30 లక్షల ఎకరాల్లో సాగవుతోంది. యాసంగి సీజన్‌లో సుమారు 5.07 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ప్రస్తుతం యాసంగి కొనుగోళ్లు సాగుతున్నాయి. మరో నెల రోజుల్లో వానాకాలం సాగుకు రైతులు సిద్ధం అవుతారు. ఈ సమయంలో రేట్లు పెంచుతున్నట్లు కంపెనీలు ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

### జిల్లాలో సాగు విస్తీర్ణం

జిల్లాలో అత్యధిక శాతం వరి పంటను సాగు చేస్తారు. తర్వాత దాదాపు 43 వేల ఎకరాల్లో పసుపు, 33 వేల ఎకరాల్లో ఎర్రజొన్న, మొక్కజొన్న, శనగ, సోయాబీన్ వంటి ఆరుతడి పంటలను జిల్లా విస్తారంగా సాగు చేస్తున్నారు. పెరిగిన ఎరువుల ధరలతో జిల్లా రైతాంగంపై తీవ్ర భారం పడనుంది. డీఏపీ ధర పెరగకుండా కేంద్రం పరిమితి విధించడంతో పాటు కంపెనీలకు ఇచ్చే డై అమ్మోనియా ఫాస్ఫేట్ సరఫరా, రాయితీని పెంచింది. దీంతో ఈ రకం మినహా మిగతా అన్ని రకాల కాంప్లెక్స్ ఎరువులు, పొటాష్, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ తదితర ఎరువుల ధరలు పెరిగాయి.

### జూన్ నుంచి..

పెరిగిన ధరలు జూన్ నుంచి అమలులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం మార్కెట్లో పాత స్టాక్ ఉంది. కొత్త బస్తాలు ఇంకా రాలేదు. జూన్‌లో పెరిగిన ధరలతో బస్తాలు వచ్చే అవకాశం ఉంది. అయితే ఇప్పుడున్న స్టాక్‌ను కూడా డీలర్లు ఎక్కువ ధరకు విక్రయించేందుకు యత్నిస్తున్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు పర్యవేక్షణ చేపట్టి అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రైవేటు డీలర్ల వద్ద ఉన్న స్టాకు వివరాలను వ్యవసాయ శాఖ సేకరిస్తోంది.

**పెరిగిన ధరల వివరాలు (రూ.లలో)**

| ఎరువులు | పాత ధర | కొత్త ధర |
|---|---|---|
| సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ | 615 | 775 |
| మ్యూరేట్ ఆఫ్ పొటాష్ | 1,850 | 1,975 |
| 16:16:16 | 1,675 | 2,050 |
| 12:32:16 | 1,850 | 1,950 |
| 24:24:0 | 2,000 | 2,200 |
| 20:20:0:13 | 1,500 | 1,800 |
| 16:20:0:13 | 1,400 | 1,750 |
| 14:15:14 | 2,150 | 2,350 |
| 15:15:15:9 | 1,650 | 1,950 |
| 10:26:26 | 1,950 | 1,025 |

## ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు డీఆర్‌వో, ఆర్డీవోల నియామకం

**అక్షరటుడే, కామారెడ్డి:** రాష్ట్రంలో పలువురు అదనపు కలెక్టర్లు, డీఆర్‌వో, ఆర్డీవోలను ప్రభుత్వం బదిలీ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో భాగంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా లో ఖాళీగా ఉన్న ముఖ్యమైన పోస్టులకు ప్రభుత్వం అధికారులను నియమించింది. డిప్యుటేషన్‌పై హైదరాబాద్ లో పనిచేస్తున్న పలువురు డిప్యూటీ కలెక్టర్లను ఉమ్మడి జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వ కార్యదర్శి లోకేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. 'కుడా'లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్ రవీందర్ రెడ్డి అర్డానుబాన్సువాడ ఆర్డీవోగా నియమించారు. తెలంగాణ సోషల్ వెల్ఫేర్, రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీ హైదరాబాద్‌లో పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్ బి.గీతను నిజామాబాద్ డీఆర్వోగా బదిలీ చేశారు.

అలాగే మెట్రోపాలిటన్ వాటర్ సప్లయ్ అండ్ సీవరేజ్ బోర్డులో పని చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ ఎం.విజయ కుమారిని బోధన్ ఆర్డీవోగా ట్రాన్స్‌ఫర్ చేశారు. బదిలీ అయిన డిప్యూటీ కలెక్టర్లు తక్షణమే విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



## 6న ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రైతుసదస్సు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం రైతుసదస్సు నిర్వహించనున్నారు. మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ రజిత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ సదస్సులో పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. అన్నదాతలు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రూ. 2.43 కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్, మార్కెట్ కమిటీ అడ్మినిస్ట్రేషన్ భవనం నిర్మాణం చేపడుతున్నట్లు ఛైర్‌పర్సన్ తెలిపారు. అభివృద్ధి పనుల నిర్మాణాల కోసం మంగళవారం భూమిపూజ నిర్వహించారు. పనులు త్వరగా పూర్తి చేసి మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే మదన్ మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.



## డిపాజిట్లు తిరిగి ఇచ్చేయాలి.. బీడీ టేకేదార్ల డిమాండ్

**అక్షరటుడే, కామారెడ్డి:** చార్ బై కంపెనీ నుంచి తమకు రావాల్సిన డిపాజిట్లు తక్షణమే ఇవ్వాలని బీడీ టేకేదార్లు డిమాండ్ చేశారు. కామారెడ్డి పర్ణిక ప్యాలెస్‌లో తెలంగాణ బీడీ కమిషన్ ఏజెంట్స్ ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రస్థాయి బీడీ టేకేదార్ల సమావేశం నిర్వహించారు. సమావేశంలో బీడీ కంపెనీల యాజమాన్యాలతో తమ సమస్యలపై టేకేదార్లు చర్చించారు. టేకేదార్లు మాట్లాడుతూ.. తాము కార్ఖానా కోసం చేసిన డిపాజిట్, బిల్డింగ్ డబ్బులు కలిపి మొత్తం రూ.10 కోట్ల వరకు రావాల్సి ఉందన్నారు. కార్ఖానాలు ఖాళీ చేసి యాజమాన్యాలకు అప్పగించిన వెంటనే డిపాజిట్ అమౌంట్ ఇవ్వాల్సి ఉన్నా ఇప్పటివరకు చెల్లించలేదన్నారు. రాష్ట్ర కన్వీనర్ ఆంజనేయులు, టేకేదార్ల జేఏసీ నాయకుడు గంగా చరణ్, గంగాధర్, పోశెట్టి, సుమారు 150 మంది టేకేదార్లు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాద బాధితులకు అండగా ఉంటాం : షబ్బీర్ అలీ

**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదంతో దుకాణాలు కోల్పోయిన బాధితులకు అండగా నిలుస్తామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తెలిపారు. కామారెడ్డి పట్టణంలోని ఇందిరాచౌక్ వద్ద అగ్నిప్రమాదం సంభవించి షాపులు దగ్ధమై జీవనోపాధి కోల్పోయిన బాధితులను మంగళవారం పరామర్శించారు. అగ్ని ప్రమాద వివరాలను అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్నిప్రమాదం వల్ల 18 షాపులు దగ్ధం కావడం బాధాకరమన్నారు. బాధితులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన నష్ట పరిహారం అందిస్తామని తెలిపారు. రూ.35 లక్షల వరకు నష్టం జరిగిందని అధికారులు అంచనా వేశారని చెప్పారు. బాధితులను ఏ విధంగా ఆదుకోవాలి అనే విషయమై చర్చిస్తామని తెలిపారు. అనంతరం 21 షాపుల బాధితులకు దాదాపు రూ.2 లక్షల వరకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో గిరి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఉమారాణి, కమిషనర్ పర్వతాలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.





## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎన్జీవోస్ ముందుంటుంది..

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎన్జీవోస్ ఎల్లప్పుడూ ముందుంటుందని ఎంప్లాయీస్ జేఏసీ రాష్ట్ర ఛైర్మన్, టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, కార్యదర్శి హుస్సేని అన్నారు. ఇటీవల నిజామాబాద్ జిల్లా టీఎన్జీవోస్ కార్యవర్గ ఎన్నికలు జరగగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గం హైదరాబాద్‌లోని రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులను మర్యాదపూర్వకంగా కలిసింది. మారం జగదీశ్వర్, హుస్సేనీ మాట్లాడుతూ జిల్లాలో ఉద్యోగులకు టీఎన్జీవోస్ అనుక్షణం అండగా నిలవాలన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన టీఎన్జీవో నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ కుమార్, కార్యదర్శి నేతికుంట శేఖర్‌లను అభినందించారు. కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర సహా అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గైని గంగారం, రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సతీష్, జిల్లా సహా అధ్యక్షుడు పెద్దోళ్ల నాగరాజు, నిరంజన్ గౌడ్, సంజీవయ్య, జాఫర్ హుస్సేన్, శివకుమార్ గౌడ్ పాల్గొన్నారు.

## పార్టీకి చేసిన సేవలకు ఫలితం దక్కింది..

**అక్షరటుడే, కామారెడ్డి:** పార్టీలో సుదీర్ఘకాలం పనిచేసిన తమకు ఎట్టకేలకు ఫలితం దక్కిందని నూతనంగా నియమించబడిన కామారెడ్డి పట్టణ, మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తెలిపారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. తమపై నమ్మకంతో అధ్యక్ష పదవులు కట్టబెట్టిన ఏఐసీసీఏ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో సంస్థాగతంగా పార్టీ బలోపేతానికి కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐరేని సందీప్, కామారెడ్డి మండల అధ్యక్షుడు రాజాగౌడ్, మాచారెడ్డి అధ్యక్షుడు నౌశిలాల్, భిక్కనూరు అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, బీబీపేట అధ్యక్షుడు పాతరాజు, దోమకొండ అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.



## గాంధారిలో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ప్రారంభం



**అక్షరటుడే, గాంధారి:** ఆడపిల్లలు గర్భాశయ సమస్యలకు గురికాకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌ను ప్రారంభించింది. ఇందుకు సంబంధించిన కార్యక్రమాన్ని సర్పంచ్ రేణుక సంజీవ్ యాదవ్, వైద్యాధికారి సాయికుమార్ మంగళవారం ప్రారంభించారు. గాంధారి మండలంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 ఏళ్లలోపు బాలికలను వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



## టెన్త్ టాపర్లను సన్మానించిన సర్పంచ్

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన అన్నాసాగర్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులను సర్పంచ్ స్రవంతి సాయగౌడ్ సన్మానించారు. పాఠశాల ఆవరణలో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ మార్కులు సాధించిన నిహారిక, బోరంచ అక్షయలతో పాటు పలువురు విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో కృషి చేసిన ఉపాధ్యాయులను ప్రశంసించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంజీవులు, జీపీవో సావిత్రి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు. నేపాల్‌లో ఇటీవల జరిగిన అంతర్జాతీయ రన్నింగ్ పోటీలో విజేతగా నిలిచిన అన్నాసాగర్ గ్రామానికి చెందిన బోరంచ మధును సర్పంచ్ స్రవంతి సాయగౌడ్, ఉప సర్పంచ్ నాగరాజు సన్మానించారు. అంతర్జాతీయ వేదికపై గ్రామ పేరు నిలిపిన మధును అభినందించారు.



నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థిని కుంట దీక్ష తన ప్రతిభతో పదో తరగతి ఫలితాల్లో మెరిసి అందరికీ ప్రేరణగా నిలిచింది. 600 మార్కులకు గాను 588 మార్కులు సాధించి జిల్లాలోనే రెండో స్థానం దక్కించుకోవడం ద్వారా తన కృషి, పట్టుదల ఏ స్థాయిలో ఉందో నిరూపించింది. - అక్షరటుడే, ఇందూరు

■ ఎస్సెస్సీ జిల్లా సెకండ్ టాపర్‌గా నిలిచిన నిజామాబాద్ విద్యార్థిని

# అకుంఠిత దీక్షతో..



నగరంలోని కుంట సంజీవ్–రాధిక దంపతుల కూతురు కుంట దీక్ష. సుభాష్‌నగర్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదివిన ఈ విద్యార్థిని తాను సాధించిన ఈ స్థాయి మార్కులు, చూపిన ప్రతిభపై అక్షరటుడేతో పంచుకున్న మనోగతాలు, అనుభవాలు, సూచనలు ఇతర విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తాయి.

**మానసిక ప్రశాంతత కూడా ముఖ్యమని దీక్ష చెబుతోంది. "ఒత్తిడి వచ్చినప్పుడు చిన్న విరామం తీసుకోవాలి. కుటుంబ సభ్యులతో మాట్లాడటం, కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవడం వల్ల చదువుపై ఫోకస్ పెరుగుతుంది.." అని వివరించింది.**

### పక్కా ప్లాన్ ప్రకారం..

"నేను ఈ స్థాయి మార్కులు సాధించడానికి ప్రధాన కారణం సరైన ప్రణాళిక. మొదటి నుంచే ఏం చదవాలి..? ఎలా చదవాలి..? అనే దానిపై స్పష్టమైన ప్రణాళిక వేసుకున్నాను. చివరి సమయంలో ఒత్తిడికి లోనవకుండా, ప్రతిరోజు కొద్దికొద్దిగా చదవడం అలవాటు చేసుకున్నాను. దీనివల్ల పరీక్షల సమయంలో భయం లేకుండా ప్రశాంతంగా రాయగలిగాను.." అని దీక్ష తెలిపింది. చదువులో ఒత్తిడి లేకపోవడం కూడా కీలకమని ఆమె పేర్కొంది. "మార్కుల కోసం నా తల్లిదండ్రులు ఎప్పుడూ నన్ను ఒత్తిడి చేయలేదు. నాపై నమ్మకం ఉంచారు. అదే నాకు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది.." అని వివరించింది.

### మొబైల్, సోషల్ మీడియాకు దూరం

విద్యార్థులకు దీక్ష ఇచ్చిన సూచనలు ఎంతో విలువైనవి.. "పరీక్షల ముందు ఒక్కసారిగా ఎక్కువ చదవడం కంటే, రోజూ కొద్దిగా చదవడం చాలా మంచిది. ముఖ్యంగా అర్థం చేసుకుంటూ చదవడం ఎంతో ముఖ్యం. టైమ్ టేబుల్ వేసుకుని దాన్ని క్రమం తప్పకుండా పాటిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు. అయితే మొబైల్, సోషల్ మీడియాకు దూరంగా ఉండటం చాలా అవసరం.." అని స్పష్టం చేసింది. కష్టపడి ఉపాధ్యాయులు చెప్పినట్లు చదివితే మంచి మార్కులు వస్తాయని తెలిపింది.

## ఇటుక బట్టీ కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ ప్రాథమిక ఉప కేంద్రం పరిధిలోని ఇటుక బట్టీలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పోచంపాడ్ వైద్యాధికారి రాకేష్ సందర్శించారు. ఈ సందర్భంగా వడదెబ్బ వల్ల కలిగే ప్రమాదాలు, వాటిని నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కార్మికులకు అవగాహన కల్పించారు. అలాగే ఆరోగ్య పరిరక్షణ కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి వేణుగోపాలరావు, ఆరోగ్య బోధకుడు మురళి, ఏఎన్ఎం భూదేవి, ఎంఎల్‌హెచ్‌పీ మనీషా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీకాంత్ కుటుంబానికి ఆర్థిక సాయం



**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని గుర్జాల్ గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ శ్రీకాంత్ ఇటీవల ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో అతని కుటుంబానికి అండగా నిలవాలని ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ సభ్యులు నిర్ణయించుకున్నారు. దీంతో డబ్బులు జమ చేసి రూ. 40 వేలు శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## రైతులు పంట మార్పిడి పద్ధతి పాటించాలి

**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని ఎల్లారం గ్రామంలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త అనిల్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులు రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలని సూచించారు. పంట మార్పిడి పద్ధతి పాటించాలన్నారు. రైతులు పంట కోతల అనంతరం వరి కొయ్యలను కాల్చవద్దని సూచించారు. శాస్త్రవేత్తలు అనిల్ రెడ్డి, మధుకర్, సర్పంచ్ రాజలింగం, ఉపసర్పంచ్ శ్యామల, వ్యవసాయ విస్తీర్ణాధికారులు రాకేష్, నవ్య పాల్గొన్నారు.



## నాగిరెడ్డిపేట మండలంలో జనాభా లెక్కల స్వీయ గణనకు శ్రీకారం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** జనాభా లెక్కల స్వీయగణన 2027లో భాగంగా నాగిరెడ్డిపేట మండలం లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రచార రథాన్ని ప్రారంభించారు. మే 10 వరకు ప్రజలు స్వచ్ఛందంగా స్వీయగణన చేసుకోవచ్చన్నారు. అచ్చాయిపల్లి గ్రామాన్ని పైలట్ గ్రామంగా ప్రచార రథంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే విధానంపై అధికారులు అవగాహన కల్పించారు. ప్రతి పౌరుడు మొబైల్ యాప్ లేదా వెబ్‌పోర్టల్ ద్వారా తమ కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవచ్చని అధికారులు వివరించారు. దీనివల్ల కచ్చితమైన జనాభా లెక్కలు సాధ్యమవుతాయని ఎంపీఎస్‌వో స్వాతి వివరించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ సందీప్, గిర్దావర్ మహేష్ చంద్ర, జీపీవో రవి, ఇతర గ్రామాల జీపీవోలు, సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో దశలవారీగా స్వీయ గణనపై అవగాహన కల్పిస్తామని తహశీల్దార్ తెలిపారు.

## ఎల్లారెడ్డిలో బీజేపీ విజయోత్సవాలు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** వెస్ట్ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో బీజేపీ సాధించిన విజయాన్ని పురస్కరించుకొని పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఎల్లారెడ్డి పట్టణంలో మంగళవారం గాంధీ చౌక్ వద్ద కార్యకర్తలు బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ "ఇది కేవలం రాజకీయ విజయం కాదు, దేశభక్తుల భావోద్వేగాలకు ప్రతిధ్వని" అని పేర్కొన్నారు. బీజేపీకి ఇంతటి ఘనవిజయాన్ని అందించిన ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నామని నాయకులు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో కూడా ఇలాంటి ఫలితాలే రావాలంటే ప్రతి నాయకుడు, కార్యకర్త కంకణబద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు అగల్ దివిటీ రాజేష్ రాష్ట్ర నాయకులు మర్రి బాలకిషన్, జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిని దేవేందర్, మాజీ అధ్యక్షుడు సతీష్, ప్రధాన కార్యదర్శులు శంకర్, శ్రీను, అశోక్, ఉపాధ్యక్షులు కాశినాథ్, శివ, సీనియర్ నాయకులు బలరాజ్, సత్యం, కోశాధికారి గజానన్, దళిత మోర్చా నాయకులు పండరి తదితరులు పాల్గొన్నారు.



## స్వీయ గణనలో రికార్డు.. సోమ్లా నాయక్ తండా ఘనత




**అక్షరటుడే, బాన్సువాడ :** బాన్సువాడ మండలంలోని సోమ్లా నాయక్ తండా స్వీయ గణనలో విశేష విజయాన్ని సాధించింది. రాష్ట్రంలోనే వందశాతం స్వీయ గణన పూర్తి చేసిన రెండో గ్రామంగా తండా రికార్డు సృష్టించింది. కలెక్టర్ సూచనల మేరకు మండల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామ ప్రజలకు స్వీయ గణనపై పూర్తి స్థాయి అవగాహన కల్పించారు. దీనివల్ల గ్రామస్థులు ఉత్సాహంగా ముందుకు వచ్చి స్వీయ గణన ప్రక్రియను పూర్తిగా విజయవంతం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజ్ నరేందర్ గౌడ్ మాట్లాడుతూ.. మండల, రెవెన్యూ, పంచాయతీ అధికారులు, ఉపాధ్యాయుల సమష్టి కృషి వల్లే ఈ విజయాన్ని సాధించగలిగామని తెలిపారు. మంగళవారం నాటికి గ్రామంలో వంద శాతం స్వీయ గణన పూర్తయిందని ఆయన వెల్లడించారు. గ్రామ ప్రజల చైతన్యం, అధికారుల కృషి కలిసొచ్చి సాధించిన ఈ విజయాన్ని స్థానికంగా అభినందిస్తున్నారు. ఇతర గ్రామాలకు ఇది ఆదర్శంగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు.

## డ్రంకన్‌డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

**అక్షరటుడే, బాల్కొండ:** బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకన్‌డ్రైవ్ నిర్వహించగా ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. పోలీసులు వారిని కౌన్సిలింగ్ చేసి కోర్టులో హాజరుపరచగా, ఆర్మూర్ జేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ ఎన్.సరలా రాణి ఇద్దరికి నాలుగు రోజుల చొప్పున సాధారణ జైలు శిక్ష విధించారు. ఈ సందర్భంగా ఎస్సై శైలేందర్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు భద్రత కోసం ప్రజలు నిబంధనలు పాటించాలని సూచించారు.

## కరెంట్ షాక్‌తో హార్వెస్టర్ దగ్ధం

**అక్షరటుడే, కామారెడ్డి:** కరెంట్ షాక్ తగిలి హార్వెస్టర్ దగ్ధమైంది. ఈ ఘటన సదాశివనగర్ మండలం మర్కల్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామ శివారులో వీర హనుమాండ్లు సమీపంలో వరి కోతలు కోసి హార్వెస్టర్ మిషన్ రోడ్డు దాటుతోంది. ఎల్టి వైర్లు కిందికి ఉండడంతో ప్రమాదవశాత్తు హార్వెస్టర్‌కు తగలడంతో ఒక్కసారిగా మంటలు అంటుకొని దట్టమైన పొగలు వ్యాప్తి చెంది హార్వెస్టర్ పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదం నుంచి డ్రైవర్ చాకచక్యంగా తప్పించుకున్నాడు. డ్రైవర్‌కు ఎటువంటి ప్రమాదం సంభవించకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. దగ్ధమైన హార్వెస్టర్ ఇందల్వాయి మండలం చంద్రాయన్ పల్లి గ్రామానికి చెందిన సంతోష్‌కు చెందినదిగా గుర్తించారు.



## పంటలకు బయోపెస్టిసైడ్స్ వాడాలి

**అక్షరటుడే, మెండోరా:** పంటలకు పురుగు మందులను అవసరమైన మోతాదు మేరకు వినియోగించాలని కీటక శాస్త్రవేత్త ఎం.సాయి చరణ్ సూచించారు. ప్రాంతీయ చెరుకు, వరి పరిశోధన స్థానం రుద్రూర్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ సమన్వయంతో మెండోరా రైతు వేదికలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు పురుగు మందులను విచక్షణాయుతంగా మాత్రమే వినియోగించాలని కీటక శాస్త్రవేత్త సూచించారు. వేపనూనె, అజాడిరక్తిన్ వంటి బయోపెస్టిసైడ్స్‌ను ప్రారంభ దశలో ఉపయోగించాలన్నారు. పురుగుల తీవ్రత పెరిగిన తర్వాత మాత్రమే రసాయన మందులను వాడాలని తెలిపారు. లింగాకర్షక బుట్టల ద్వారా పురుగుల స్థాయిని గుర్తించి సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి ఎస్.వైష్ణవ్ మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంట రకాలను సాగు చేయాలని తెలిపారు. సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని చెప్పారు. వేల్పూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కె.ముత్యం రెడ్డి మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విత్తనాలు, ఆధునిక పద్ధతులు అనుసరిస్తే అధిక దిగుబడి, లాభాలు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి టి.సంధ్య రేఖ, సర్పంచ్ బి.ప్రమోద్, ఉప సర్పంచ్ ఎం.రాజేశ్వర్, కోడిచర్ల సర్పంచ్ వి.శ్రీనివాస్, ఎఫ్‌పీవో ఛైర్మన్ ఎస్.సాయి రెడ్డి, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## కామారెడ్డి కోర్టు సంచలన తీర్పు..
## పోక్సో కేసు నిందితుడికి జీవితఖైదు

**అక్షరటుడే, కామారెడ్డి:** పోక్సో కేసులను కామారెడ్డి కోర్టు సీరియస్‌గా పరిగణిస్తోంది. గతేడాది మార్చి చివరి వారంలో ముగ్గురు పోక్సో నిందితులకు 20ఏళ్ల పాటు జైలు శిక్ష విధించగా తాజాగా మంగళవారం మరో కేసులో జీవితఖైదు విధిస్తూ సంచలన తీర్పు వెలువరించింది. కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ విద్యార్థిని పట్టణంలోని ఒక ప్రైవేట్ కాలేజీలో చదువుకుంటుండగా అదే కాలేజీలో చదువుతున్న తోకల రాజశేఖర్ అనే యువకుడు ఆమెను ప్రేమిస్తున్నానని వేధించాడు. ఆమె తనకు ఇష్టం లేదని చెప్పినప్పటికీ ఆత్మహత్య చేసుకుంటానని ఆమె ఫోన్‌కు వీడియోలు పంపి భయపెట్టాడు. ఈ క్రమంలో ఆమెతో మాట్లాడిన ఫోన్ రికార్డులను దుర్వినియోగం చేసేందుకు ప్రయత్నించాడు. ఆ అమ్మాయికి మాయమాటలు చెప్పి ఒంటరి ప్రదేశానికి తీసుకెళ్లి బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాధితురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. విచారణ అనంతరం తోకల రాజశేఖర్‌ను అరెస్టు చేశారు. అనంతరం పూర్తి సాక్ష్యాధారాలను సేకరించి పోక్సో చట్టం కింద కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు, సాక్ష్యాలు, వైద్య నివేదికను పరిశీలించి కేసు రుజువు కావడంతో జిల్లా న్యాయమూర్తి వరప్రసాద్ నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.50 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.